క్లుప్తంగా

ఇక రోజు విడిచి రోజు తాగునీటి సరఫరా

కర్నూలు (టౌన్) : నగరంలో ఏప్రిల్ రెండో వారం నుంచి తాగునీటి సరఫరా రోజు విడిచి రోజు ఉంటుందని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది అతి తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. సుంకేసుల రిజర్వాయర్‌లో ఉన్నటువంటి నీటి నిల్వలు అడుగంటిపోయినట్లు తెలిపారు. ప్రస్తుతం 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి తాగునీటిని కేసీ కెనాల్ ద్వారా తీసుకొస్తున్నామన్నారు. అయితే, ప్రతి రోజు నీటి సరఫరాకు అవసరమైన మేర నీళ్లు రావడం లేదని తెలిపారు. దీంతో వేసవికాలం ముగిసే వరకు నగరంలోని 52 వార్డులకు రోజు విడిచి రోజు నీరు సరఫరా చేసేందుకు ప్రణాళికలు తయారు చేసినట్లు తెలిపారు. నగర ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడుకొని నగరపాలక సిబ్బందికి సహకరించాలని కోరారు.

విద్యార్థులకు కంప్యూటర్ విద్యపై అవగాహన

సి.బెళగల్: స్థానిక మోడల్ స్కూల్‌లో ఇంటర్ మీడియెట్ విద్యార్థులకు కంప్యూటర్ విద్యపై ఉపాధ్యాయుడు హరిశంకర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంటర్ విద్యార్థులకు ఎలక్ట్రానిక్ ట్రేడ్ ఇంటర్‌షిప్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక శ్రీవినాయక డిగ్రీ కాలేజీలో కంప్యూటర్‌పై అవగాహన, శిక్షణ కార్యక్రమాలను చేపట్టారు.

నేడు వైఎస్సార్‌సీపీ ప్రచారం ప్రారంభం

సి.బెళగల్: మండల పరిధిలోని పలు గ్రామాలలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. మండలంలోని బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, బ్యాతోలి గ్రామాల్లో సాయంత్రం నాలుగు గంటల నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోడుమూరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ పాల్గొంటారని చెప్పారు.

గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

సి.బెళగల్: గ్రామాలలోని వారంలో మూడు రోజులు ప్రత్యేక పారిశుద్ధ్య పనులను చేపట్టాలని ఈఓఆర్డీ సందీప్ అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి గ్రామాలలో ఆయా గ్రామ సర్పంచ్‌లు చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలోని ప్రధాన రోడ్డు పక్కనున్న చెత్తను తొలగించాలన్నారు.

88 శాతం పింఛన్ల పంపిణీ


పింఛన్ అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ అశోక్

ఓర్వకల్లు: మండలంలోని వివిధ గ్రామాలలో గురువారం 88 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీఓ మల్లీశ్వరి తెలిపారు. గత ఐదేళ్ల పాటు పింఛన్ సొమ్మును వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేయడంతో మొదటి రోజునే 98 శాతం పంపిణీ జరిగేది. మండలంలో మొత్తం 7,836 మంది పింఛన్‌దారులకు గాను ఇప్పటి వరకు 6,894 మందికి పింఛన్ సొమ్మును అందజేసినట్లు తెలిపారు.

పార్టీ కోసం కష్టపడండి

పాణ్యం: తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం కష్టపడి పని చేయాలని ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. గురువారం భూపనపాడు గ్రామంలో నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా పార్టీ కార్యకర్త శివరాముడు కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. ఆమె వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం వద్ద సిమెంట్ నగర్ రోడ్డులో బైక్, ఆటో ఎదురెదురై ఢీకొన్నాయి. ఈ ఘటనలో బైక్‌పై వెళ్తున్న బేతంచెర్ల మండలం ముద్దవరం గ్రామానికి ఇద్దరు యువకులు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా గాయపడిన ఇద్దరు యువకుల పేర్లు మద్దిలేటి అని 108 సిబ్బంది తెలిపారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సి.బెళగల్: ప్రజలు వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి నూకరాజు సూచించారు. గురువారం ఆయన ఈఓఆర్డీ సందీప్‌తో కలిసి మండలంలోని గ్రామాలలో పర్యటించి, గ్రామ పరిశుభ్రత, ఆరోగ్య సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కె.సింగవరం గ్రామంలో డెంగీ అనుమానిత వ్యక్తి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. గ్రామ ప్రజలకు ఆరోగ్య రక్షణ చర్యలు, వ్యాధుల నివారణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేయించి, బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించాలని గ్రామ సర్పంచ్ రవీంద్రనాథ్‌రెడ్డికి వైద్యులు సూచించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి రంగస్వామి, హెల్త్ సూపర్‌వైజర్ మద్దిలేటి ఉన్నారు.

టీడీపీకీ ఓటు వేస్తే మళ్లీ కష్టాలే

- ఎన్నికల ప్రచారంలో కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్


40వ వార్డులో ఇస్త్రీ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డా.ఆదిమూలపు సతీష్


నందనపల్లి పంచాయతీలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్

కర్నూలు సిటీ: తెలుగుదేశం పార్టీ నాయకుల మాయమాటలు నమ్మి ఆ పార్టీకి ఓటు వేస్తే కష్టాలు కొనితెచ్చుకున్నట్లు అవుతుందని కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి డా.ఆదిమూలపు సతీష్ పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని కర్నూలు అర్బన్ 40వ వార్డులో గురువారం ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశామని, అర్హులైన ప్రతి పేదవాడికి నవరత్నాల ద్వారా పథకాలను అమలు చేశామన్నారు. జగనన్న ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయన్నారు. దీనిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీల నాయకులు కుట్రలు పన్నుతున్నారన్నారు. చివరకు వలంటీర్ల ద్వారా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఇంటి దగ్గరకు వెళ్లి పింఛన్లు ఇచ్చే ప్రక్రియను సైతం అడ్డుకుంటున్నారన్నారు. ప్రజలు ఓటు వేసే ముందు ఆలోచన చేయాలని, వేసే ఓటు మన పిల్లలు, మన భవిష్యత్తుకు మేలు చేసేలా ఉండాలన్నారు. ఈ విషయంలో ఏ మాత్రం అశ్రద్ధ చేసినా సంక్షేమం, అభివృద్ధి దూరమవుతుందన్నారు. తాను నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో 40వ వార్డు కార్పొరేటర్ విక్రమ్ సింహారెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, గిరి ప్రసాద్, రాము, మహేష్, ఇర్షద్, అఖిల్, తులసి, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను ఆదరించండి

దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేని విధంగా ఒకవైపు సంక్షేమ పథకాలు, మరోవైపు అభివృద్ధి చేస్తున్న జగనన్నను ఎన్నికల్లో మరోసారి ఆదరించాలని కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ కోరారు. గురువారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని నందనపల్లి పంచాయతీలోని భూపాల్ నగర్, మిలిటరీ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ పాల్గొన్నారు. వీరంతా ఇంటింటికీ వెళ్లి 58 నెలల్లో పేదలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి, చేసిన మేలు గురించి వివరించారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. అప్పట్లో పేదలు, బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందేవి కాదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ఆయా వర్గాలకు మేలు జరిగిందని చెప్పారు. వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే గ్రామంలో నెలకొన్న ప్రతి సమస్యను పరిష్కరిస్తామని , రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి కల్పనకు అత్యధిక ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. ప్రచార కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రసన్న కుమార్, మండల కన్వీనర్ మహబూబ్ బాషా, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు డి.వాసు, వైస్ ఎంపీపీ నెహిమియ, గ్రామ సర్పంచు మాధవి, గొందిపర్ల సర్పంచు శ్రీనివాసులు, నందనపల్లి ఎంపీటీసీ శేఖర్, గార్గేయపురం సింగిల్ విండో చైర్మన్ వినయ్‌కుమార్ రెడ్డి, ఎంపీటీసీ హనుమంతు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ఎల్లమ్మ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ మహేష్ రెడ్డి, పసుపుల సింగిల్ విండో చైర్మన్ శేషిరెడ్డి, మాజీ ఎంపీటీసీ చిన్నలక్ష్మన్న, నాయకులు మోహన్ బాబు, ఆంజనేయ గౌడు, సంపత్‌కుమార్, వెంకటేశ్వర్లు, రామ్మోహన్ రెడ్డి, కేశవరెడ్డి, అఖిలేశ్వర్ రెడ్డి, పడిదెంపాడు వెంకటేష్, చక్రపాణి రెడ్డి, సురేష్, మాజీ సర్పంచు యోసేపు, ప్రభుదాసు, మధుసూదన్, ఎస్సీ సెల్ నాయకులు ప్రసాద్, శేఖర్, బొజ్జన్న, పంచలింగాల వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఆయుధం ఓటు


ఉలిందకొండలో ఓటర్ల అవగాహన ర్యాలీలో మాట్లాడుతున్న ఆర్వో/జేసీ మౌర్య

కల్లూరు : ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఆయుధం ఓటు అని, ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పాణ్యం ఆర్వో/జేసీ నారపురెడ్డి మౌర్య అన్నారు. గురువారం కల్లూరు మండలం పందిపాడు, పెద్దటేకూరు, ఉలిందకొండ, కొంగనపాడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఉలిందకొండ గ్రామంలో ఓటర్లకు అవగాహన కోసం నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఓటర్లు ఎటువంటి భయాందోళనలకు గురి కాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా భరోసా ఇవ్వడమే తమ ఉద్దేశమన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేకంగా పోలీసు బలగాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కల్లూరు తహసీల్దార్ మునివేలు, మండల స్థాయి ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద పోస్టింగ్‌లపై ప్రత్యేక నిఘా


గడివేములలో పోలీసు కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

పాణ్యం/గడివేముల: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సోషల్‌మీడియాలో షేర్ చేసే వివాదాస్పద పోస్టింగ్‌లపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు పాణ్యం సీఐ నల్లప్ప అన్నారు. గురువారం పాణ్యం సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి వాట్సప్ గ్రూప్‌పై నిఘా ఉంచామన్నారు. రాజకీయనాయులు, ప్రజాప్రతినిధులపై వాట్సాప్ గ్రూప్‌లో ఏమైనా దుష్ప్రచారం చేస్తే కోడ్ ఆఫ్ కండక్ట్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే పోస్టింగ్ షేర్ చేసిన గ్రూప్ అడ్మినే అన్ని చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో అడ్మిన్లు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలను సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అశోక్ సిబ్బంది తెలిపారు.

గడివేములలో కవాతు

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పాణ్యం సీఐ నల్లప్ప హెచ్చరించారు. గురువారం మండల కేంద్రం గడివేముల గ్రామం జెడ్పీ స్కూల్ వద్ద నుంచి గంగమ్మకట్ట వద్దకు కేంద్ర బలగాలతో కలిసి సీఐ,ఎస్‌ఐ కవాతు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు,పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటర్లను ఎవరైనా ప్రలోభాలకు, భయభ్రాంతులకు గురి చేసినా ఉపేక్షించేది లేదన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. తప్పుడు సమాచారాన్ని సామాజిక మధ్యమాల ద్వారా వ్యాప్తి చేయరాదన్నారు. కార్యక్రమంలో గడివేముల ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు కాటసాని


తమ్మరాజుపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న కాటసాని ఉమామహేశ్వరమ్మ

పాణ్యం : పేద ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అని, అందుకే ఆయనను 2024 సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని ఎమ్మెల్యే సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ కోరారు. గురువారం తమ్మరాజుపల్లె, కందికాయపల్లె గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి పేద కుటుంబానికి ఎమ్మెల్యే కాటసాని సుపరిచితుడన్నారు. వారికి ఏ చిన్న కష్టమొచ్చినా ముందుండే నాయకుడు కాటసాని అన్నారు. ఈ ఎన్నికల్లో కూడా ఆయనకు మద్దతుగా నిలిచి అధిక మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతిపక్ష నాయకులకు ప్రజలు గుర్తుచ్చారన్నారు. అధికారం ఇస్తే వందల హామీలు అమలు చేస్తామని బూటకపు మాటలు చెబుతున్నారని, అలాంటి నాయకులకు నమ్మొద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, ఎంపీటీసీలు వెంకటేశ్వర్లు, రమణయ్య, సర్పంచ్‌లు విజయగౌరి, రామచంద్రుడు, మాజీ సర్పంచ్ చిన్నవన్నూర్‌సా, కో -ఆప్షన్ సభ్యులు జాకీర్ హుసేన్, బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీని సక్రమంగా నిర్వహించాలి


కె.నాగలాపురంలో పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ జయశ్రీ

గూడూరు రూరల్: మండల పరిధిలోని ఆయా గ్రామాల సచివాలయాల్లో చేపట్టిన పింఛన్ల పంపిణీని సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ జయశ్రీ సూచించారు. బూడిదపాడు, కె.నాగలాపురం, పెంచికలపాడు, గుడిపాడు గ్రామాల్లో గురువారం పింఛన్ల పంపిణీని ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా వలంటీర్ల ద్వారా పింఛన్‌దారుల ఇంటికి వెళ్లి సొమ్మును అందిస్తుండగా ఎన్నికల కోడ్ కారణంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వార్డు, గ్రామ సచివాలయాల్లో పింఛన్‌ను అందించే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పింఛన్‌దారులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు సచివాలయాల ముందు షామియానాలు, కుర్చీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నడవలేని స్థితిలో ఉన్న వారి ఇంటికి సచివాలయ ఉద్యోగులు వెళ్లి పింఛన్‌ను అందిస్తారన్నారు.

ఉన్నత లక్ష్యంతోనే జీవితంలో రాణింపు

- ఆర్‌యూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బి. సుధీర్‌ప్రేమ్‌కుమార్


క్విజ్ విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వీసీ సుధీర్ ప్రేమ్ కుమార్, రెక్టార్ ఎన్.టి.కె. నాయక్, రిజిస్ట్రార్ నాగుల అంకన్న

కర్నూలు కల్చరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యం కలిగి ఆ దిశగా సాధన చేస్తే జీవితంలో రాణిస్తారని రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బి. సుధీర్‌ప్రేమ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రతి సంవత్సరం నిర్వహించే క్విజ్ పోటీల క్విజ్ ఛాంపియన్‌షిప్ -2024 రీజనల్ క్వాలిఫైర్స్ రౌండ్‌ను గురువారం వర్సిటీ సెనేట్ హాల్‌లో వీసీ ప్రారంభించి ప్రసంగించారు. ఉన్నత విద్యా సంస్థల్లో విద్యను అభ్యసించే విద్యార్థులు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా వివిధ విషయాల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రాజెక్ట్ వర్క్, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, ఇంటర్న్ షిప్ లాంటి కార్యక్రమాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. అందులో భాగంగా ఈ సంవత్సరం రీజనల్ స్థాయి పోటీల నిర్వహణ బాధ్యతను రాయలసీమ యూనివర్సిటీకి అప్పగించారన్నారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకొని మరింత ముందుకు సాగాలన్నారు. వర్సిటీ రిజిస్ట్రా ర్ డాక్టర్ నాగుల అంకన్న, ఉన్నత విద్యా మండలి అకడమిక్ ఆఫీసర్ ఆచార్య ఎస్.చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం క్విజ్ విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.వి.కృష్ణారెడ్డి, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య ఎస్.నరసింహులు, పరీక్షల విభాగం డీన్ ఆచార్య పుచ్చా వెంకట సుందరానంద్, అకడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య భరత్‌కుమార్, రీసెర్చ్ డైరెక్టర్ ఆచార్య సి.విశ్వనాథరెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై. హరిప్రసాద్‌రెడ్డి, ఉన్నత విద్యా మండలి యంగ్ ప్రొఫెషనల్ శ్రీజ, అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేలు చేసే ప్రభుత్వానికి మద్దతు ఇవ్వండి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


35వ వార్డులో వృద్ధురాలికి ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: అర్హతే ప్రామాణికంగా రాష్ట్రంలో ప్రతి గడపకు సంక్షేమాన్ని చేరువ చేసిన జగనన్న ప్రభుత్వానికి ఎన్నికల్లో అండగా నిలబడాలని పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కల్లూరు అర్బన్ 35వ వార్డులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం కాటసాని మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్ల ద్వారా ఇంటి వద్ద పింఛన్ పంపిణీ చేపడుతుండగా టీడీపీ నాయకులు కుట్రతో అడ్డుకున్నారని విమర్శించారు. 2014లో మోసపూరిత హామీలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన అనంతరం వారు ఇచ్చిన హామీలను విస్మరించడంతో పాటు జన్మభూమి కమిటీలతో ప్రజలను వేధింపులకు గురిచేసిందని గుర్తు చేశారు. మరోమారు మోసపూరిత మాటలతో ప్రలోభాలకు గురి చేయడానికి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు వస్తున్నారని, వారి అబద్ధపు మాటలను నమ్మి మోసపోవద్దన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేయాలన్నారు. ఒకటి అసెంబ్లీ అభ్యర్థికి, మరొకటి ఎంపీ అభ్యర్థికి వేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మాధురి, పలువురు కార్పొరేటర్లు సాన శ్రీనివాసులు, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ, వార్డులోని నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక


పార్టీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు : మండలంలోని బొల్లవరం గ్రామంలో టీడీపీకి చెందిన 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరినట్లు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి వెల్లడించారు. గురువారం సాయంత్రం పాణ్యం ఎమ్మెల్యే నివాసంలో బొల్లవరం గ్రామానికి చెందిన మనోజ్‌కుమార్, మిన్నెల్ల హుస్సేన్, హరీష్, రాకేష్, షబ్బీర్, శ్రీనివాసులు, మహేష్, మధు, నవీన్, నారాయణరెడ్డి, ఇస్మాయిల్, రాజేష్, మంజునాథ్‌తో పాటు 50 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరందరికీ పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, యువనేత కాటసాని శివనరసింహారెడ్డి కండువాలు వేసి పార్టీలో చేర్చుకున్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చాంద్‌బాషా, మస్తాన్‌నాయుడు, నూర్ అహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ఎండలపై జాగ్రత్తగా ఉండాలి


వడదెబ్బపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది


కోడుమూరులో పోలీస్ సిబ్బందికి గ్లూకోస్ ప్యాకెట్లను అందజేస్తున్న సీఐ మన్సురుద్దీన్

కోడుమూరు రూరల్ : మండుతున్న ఎండల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోడుమూరు కోలోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మదన్ శేఖర్ సూచించారు. గురువారం స్థానిక కేజీబీవీ పాఠశాలలోని విద్యార్థులకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలంతా 11గంటల కల్లా పనులు చేసుకుని ఇళ్లకు చేరుకోవాలన్నారు. ఎండల్లో తిరగడం, శ్రమ చేయడం వల్ల అలసట, వికారం, వాంతులు, నోరు, కళ్లు పొడి బారడం వంటి డీహైడ్రేషన్ లక్షణాలు కన్పిస్తే వెంటనే ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని తాగుకుంటూ దగ్గరలోని హాస్పిటల్‌కు తీసుకెళ్లి చికిత్స చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గౌసియాబేగం, హెల్త్ సూపర్‌వైజర్ కమాల్‌సాహెబ్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులున్నారు.

పోలీస్ సిబ్బందికి గ్లూకోస్ ప్యాకెట్లు పంపిణీ

ఎండల తీవ్రత దృష్ట్యా పోలీస్ సిబ్బంది వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకుగాను కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్ తమ సిబ్బందికి గ్లూకోస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. సీఐ మాట్లాడుతూ ఎండకు డ్యూటీ చేసే సమయాల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వేలంలో పెరిగిన ఆదాయం


వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామంలో వెలసిన పలు దేవాలయాలకు సంబంధించిన ఆలయ భూముల ఆదాయం గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పెరిగింది. గురువారం స్థానిక నగరేశ్వర, వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద ఆలయ భూములకు వేలం పాట నిర్వహించారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఆలయ ఈఓ సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో 2024–26 వరకు కౌలుకు నిర్వహించిన వేలం పాటలో శ్రీలక్ష్మిమాధవ, వీరాంజనేయస్వామి దేవస్థానాలకు సంబంధించిన 86 ఎకరాల భూమి గతంలో రూ.3,21,800 పోగా, ఈ ఏడాది రూ.3,46,800కు పాడారు. దీంతో గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.25000 అదనంగా ఆదాయం వచ్చింది. అలాగే నాగేశ్వర, వీరభద్రస్వాములకు సంబంధించిన 108 ఎకరాల భూములు గతంలో రూ.3,63,400కు పోగా, ఈ ఏడాది రూ.4,03,200లకు వేలం వేశారు. దీంతో 39,800 అదనపు ఆదాయం లభించినట్లు అధికారులు వెల్లడించారు. లొద్దిపల్లె ఆంజనేయస్వామి దేవస్థానానికి చెందిన 12 ఎకరాల భూమి గతంలో రూ.81300 వేలం పాడగా, ఈ ఏడాది 90,000కు వేలం వేశారు. దీంతో రూ.8,200 అదనపు ఆదాయం లభించినట్లు ఈఓ సీతారామిరెడ్డి వెల్లడించారు.

రెండవరోజూ తప్పని తిప్పలు

- కొనసాగిన పింఛన్‌దారుల అవస్థలు
- ఇబ్బందులున్న వారి ఇళ్లకు వెళ్లి పంపిణీ చేసిన ఉద్యోగులు


ముడుమాలలో వృద్ధుడు మల్లెపోగు తిక్కన్నకు పింఛన్ ఇస్తున్న ఉద్యోగులు రాజన్న, హరి


సి.బెళగల్ సచివాలయం - 2కు అవస్థలుపడుతూ చేరుకుంటున్న వృద్ధులు


కోడుమూరులో గ్రామ సచివాలయం-2 వద్ద పింఛన్ల కోసం పడిగాపులు కాస్తున్న వృద్ధులు


గూడూరు- 4 వ వార్డు సచివాలయంలో పింఛన్ల కోసం వేచివున్న లబ్ధిదారులు

సి.బెళగల్: పింఛన్ పంపిణీలో వలంటీర్ల సేవలు ఆగిపోవడంతో గ్రామాలలో పింఛన్ లబ్ధిదారుల అవస్థలు రెండవరోజు కొనసాగాయి. మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో 7,253 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా, పింఛన్ పంపిణీని గురువారం ఎంపీడీఓ శకుంతల, ఈఓఆర్డీ సందీప్‌లు పర్యవేక్షించారు. ఆయా శాఖల సచివాలయ ఉద్యోగులు కార్యాలయాల్లో, సమస్యలున్న వారికి, ఇబ్బందులు పడేవారి ఇళ్లకు వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. దీనితో మండలంలో 6,608 మందికి పింఛన్ చేయడంతో 90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి అయ్యిందని ఎంపీడీఓ తెలిపారు.

రెండో రోజు కూడా పడిగాపులే..

కోడుమూరు రూరల్ : ప్రతి నెల ఒకటో తేదీనే తమ ఇళ్ల వద్దే పింఛన్లు తీసుకునే వృద్ధులు, వికలాంగులు, వితంతువులు టీడీపీ కుట్ర వల్ల పడరాని పాట్లు పడుతున్నారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు గ్రామ సచివాలయాల వద్దకే వచ్చి పింఛన్‌దారులు పింఛన్లు తీసుకోవాలన్న నిబంధనలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం సాయంత్రం నుంచి మండలంలో గ్రామ సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేస్తున్నా కొన్ని చోట్ల మాత్రం వందలాది మంది లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేయలేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో గురువారం ఉదయం నుంచే గ్రామ సచివాలయాల వద్ద పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న వృద్ధులే కనిపించారు. జగనన్న పుణ్యమా అని ప్రతి నెల ఇంటి వద్దే టంఛన్‌గా పింఛన్ తీసుకునే మమ్మల్ని ఇలా ఇబ్బందుల పాలు చేస్తున్న చంద్రబాబుకు ఏమి వస్తుందో అర్థం కావడం లేదంటూ వాపోయారు. ఇదిలా ఉండగా నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు, వికలాంగులకు గ్రామ సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు అందజేస్తున్నారు.

పింఛన్ల పంపిణీ నిర్లక్ష్యం చేసిన సిబ్బందికి షోకాజ్ నోటీసులు

పింఛన్ల పంపిణీని నిర్లక్ష్యం చేసిన కోడుమూరు గ్రామ సచివాలయానికి చెందిన నలుగురు సిబ్బందికి ఎంపీడీఓ దివ్య గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పింఛన్ల పంపిణీని సక్రమంగా నిర్వహించాలని, ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గూడూరు లో 95 శాతం పింఛన్ల పంపిణీ

గూడూరు: పట్టణంలో గురువారం ఉదయం నుంచి వార్డు సచివాలయాల సిబ్బంది పింఛన్ల పంపిణీ మొదలు పెట్టారు. పట్టణంలో 2,315 మంది పింఛన్ దారులుండగా 95 శాతం పంపిణీ జరిగిందని మున్సిపల్ కమిషనర్ వి.దివాకరరెడ్డి తెలిపారు. పింఛన్ల పంపిణీ వద్ద షామియానాలు, కుర్చీలు, తాగునీటి వసతిని అధికారులు ఏర్పాటు చేశారు.